

ప్రచార హోరు



- గంటల పాటు ప్రచారం పేరిట టెలికాలర్‌ల వేధింపులు
- జిల్లాలో ప్రతీ పది నిమిషాలకు ఒక ప్రచార కాల్
- అభ్యర్థులందరిదీ ఇదే తీరు
- సర్వేల పేరిట కూడా పరోక్ష ప్రచారం
- హోరెత్తుతున్న గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

నిర్మల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులంతా సోషల్ మీడియాను ప్రధాన ప్రచారఅస్త్రంగా మలుచుకుంటున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, టెలిగ్రామ్, ఇన్‌స్ట్రాగ్రామ్ తదితర సామాజిక వేదికల్లో అభ్యర్థులు గత కొద్ది రోజుల నుంచి తమను గెలిపించాలని కోరుతూ ప్రచార పర్వాన్ని హోరెత్తిస్తున్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గ టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్‌ల పర్వం మొదలుకాక ముందే నుంచే నాలుగు ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి తమ సన్నిహితులు, అనుచరులు సంఘాల సభ్యులను కలిసి మొదటిరౌండ్ ప్రచారాన్ని పూర్తి చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ , టీచర్ ఎమ్మెల్సీలకు తమ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించింది. అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం కేవలం గ్రాడ్యుయేట్ అభ్యర్థిని ప్రకటించి టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం విషయంలో ఇప్పటి వరకు స్పష్టతనివ్వలేదు. అయితే మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉంటుండడం ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మాత్రం ఇతర పార్టీ అభ్యర్థులు, ఇండిపెండెంట్‌ల కన్నా ముందుగానే సోషల్ మీడియా ద్వారా తమ ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని రంగంలోకి దింపగా టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం విషయంలో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే తెలంగాణ పీఆర్‌టీయూ, పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థులిద్దరిలో ఎవరో ఒకరికి మద్దతు ఇవ్వడమో లేదంటే తటస్థంగా ఉండడమోననే అంశంపైన కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందంటున్నారు. అయితే ప్రధాన పార్టీల మద్దతు కూడగట్టేందుకు సోషల్ మీడియా ద్వారా ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. రాజకీయ పార్టీలకు చెందిన గ్రూపులు అలాగే వాటి అనుబంధ సంఘాల గ్రూపులతో పాటు టీచర్ సంఘాల గ్రూపులు, వివిధ ఉద్యోగ సంఘాల గ్రూపులు, కుల సంఘాల గ్రూపులు, యువజన సంఘాలు, వివిధ ఉద్యోగ సభ్యులుగా ఉండే తమ అనుచరులతో అభ్యర్థులంతా ఆ గ్రూపుల్లో తమ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. తమను గెలిపిస్తే అటు గ్రాడ్యుయేట్‌లకు ఇటు టీచర్లకు చేసే సేవలతో పాటు తమ పార్టీ పరమైన, వ్యక్తిగతమైన మెనిఫెస్టోను కూడా ఈ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు.



టెలికాలర్ల ఫోన్‌కాల్స్‌తో ఓటర్లకు ఇబ్బందులు

కాగా గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వాయిస్ మేసేజ్‌లతో ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు. ముఖ్యంగా పలువురు అభ్యర్థులు టెలికాలర్లను నియమించుకొని వారి ద్వారా ప్రతిరోజూ వందలాది మంది సెల్‌ఫోన్ వినియోగదారులకు ఫోన్‌లు చేయిస్తూ ఫలానా అభ్యర్థి ఆఫీసు నుంచి మాట్లాడుతున్నామని, తమ అభ్యర్థితని తప్పనిసరిగా గెలిపించాలని కోరుతూ ఆదరగొడుతున్నారు. ఈ టెలికాలర్ల గోల తట్టుకోలేక చాలా మంది తమ ఫోన్‌లను ఆఫ్ చేస్తున్నారు.

సర్వేల పేరిట పరోక్ష ప్రచారం

కాగా మరికొంతమంది అభ్యర్థులు పరోక్షంగా సర్వేల పేరిట తమ బలాబలాలను బేరీజు వేసుకుంటున్నారు. కాగా కొంతమంది టెలికార్లు ఓటర్లకు ఫోన్ చేస్తూ తాము ఓ సర్వే సంస్థకు చెందిన ప్రతినిధులమని చెబుతూ పరిచయం చేసుకుంటున్నారు. ఆ తరువాత మీరు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయబోతున్నారని లేదంటే ఎవరికి మద్దతు ఇచ్చే అవకాశం ఉందంటూ ప్రశ్నిస్తున్నారు. అయితే ఎవరైనా తాము ఫలానా అభ్యర్థికి ఓటు వేస్తామని చెప్పగానే దానికి గల కారణాలు కూడా అడుగుతూ ఓటర్లను కూపీలాగుతున్నారు. అయితే ఈ సంస్థల పేరిట కొంతమంది అభ్యర్థులు తమతో పాటు తమమ ప్రత్యర్థుల బలాబలాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారంటున్నారు.

పతాకస్థాయిలో ప్రచారం

గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారపర్వం రోజు రోజుకు పతాకస్థాయికి చేరుకుంటోంది. సాధారణ ఎన్నికల తరహాలోనే అభ్యర్థులు తమ ప్రచార పర్వాన్ని హోరెత్తిస్తున్నారు. సోషల్ మీడియాతో పాటు వివిధ పార్టీల అభ్యర్థులు అలాగే ఆ పార్టీల అగ్ర నాయకులు, స్థానిక నాయకులు, జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల బాధ్యులంతా ఈ ప్రచారంలో పాల్గొంటూ తమ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. మరోవైపు టీచర్స్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రతినిధులు నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఓటర్లకు పరిచయ సమావేశాల పేరిట పెద్ద ఎత్తున విందు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుండడం చర్చనీయాంశమవుతోంది. ముఖ్యంగా సమాజానికి మార్గదర్శకంగా నిలవాల్సిన టీచర్లు సైతం ఎమ్మెల్సీ అభ్యర్థులు ఏర్పాటు చేస్తున్న పరిచయ విందు కార్యక్రమాలకు పోటాపోటీగా హాజరవుతుండడం విమర్శలకు తావిస్తోంది. గెలుపే లక్ష్యంగా ఇటు గ్రాడ్యుయేట్ అటు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అన్ని రకాల ఎత్తుగడలను అమలు చేస్తూ ఓటర్లను ఆకర్షించేందు కోసం తంటాలు పడుతున్నారు. యూనియన్‌లతో పాటు కుల సంఘాల సమీకరణలతో సైతం ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

నేడు భైంసాకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక



భైంసా , ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి భైంసాకు రానున్నాడు. సాయంత్రం 4గంటలకు స్థానిక ఎస్ఎస్ జి న్నింగ్ ఫ్యాక్టరీలో జరుగనున్న బీజేపీ పార్టీ ముథోల్ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు, పట్టభద్రుల ఓటర్లతో సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్, బీజేపీ జిల్లా ప్రతినిధులు పాల్గొననున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరు కానున్న ఎమ్మెల్సీ ప్రచార సభకు నియోజక వర్గ పరిధిలోని పార్టీ శ్రేణులు, పట్టభద్రులు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ముథోల్ ఎమ్మెల్యే రామరావుపాటిల్ విజ్ఞప్తి చేశారు.

24న జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి రాక



విలేకరులతో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి, నాయకులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 24న సోమవారం జిల్లా కేంద్రానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్టు రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్. అన్వేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేరుగా సీఎం పట్టభద్రులతో మాట్లాడుతారని అన్వేష్‌రెడ్డి అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఉద్యోగ నియామకాలు జరుగలేదన్నారు. నీళ్లు, నియామకాలు, ఉద్యోగాల కోసం తెలంగాణ ఏర్పాటైందన్నారు. ఎలాంటి మార్పు లేకపోవడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారన్నారు. అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి 55 వేల ఉద్యోగాలు కల్పించారన్నారు. ఉద్యోగులకు మొదటి వారంలోనే జీతాలు అందించేలా చర్య తీసుకుంటుందన్నారు. ఆర్థిక ఇబ్బందులున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలందిస్తున్నామన్నారు. ఈ నెల 27న జరిగే నాలుగు జిల్లాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విద్యావేత్త నరేందర్‌రెడ్డి పోటీలో ఉన్నారని భారీ మెజార్టీతో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అర్జుమన్ అలీ, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు ఈశ్వర్, గణేష్, ఏఎంసీ ఛైర్మన్ భీమ్ రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్



నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోత) : ముజ్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ మంజునాథ్ శుక్రవారం రోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వలను పరిశీలించారు. గడువు తేదీకి దగ్గరగా ఉన్న మందులను ముందుగా ఉపయోగించాలని, అదే విధంగా రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ మీడియా అధికారి బారే రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

ఒకరికి తీవ్ర గాయాలు



మైసయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై హన్మాండ్లు

పెంబి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని నాగపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. సంఘటన స్థలాన్ని ఎస్సై హన్మాండ్లు పరిశీలించి, తెలిపిన వివరాల ప్రకారం... నాగపూర్ గ్రామానికి చెందిన మైసయ్య(47) కౌలుకు చేస్తున్న భూమిలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడని, గురువారం రాత్రి తన కొడుకు మహేష్‌తో కలిసి పంటకు కావలి వెళ్లాడని, రాత్రి పూట వెలుతురు కోసం బల్బు ఏర్పాటు చేయడంతో ప్రమాదవశాత్తు కరెంటు వైర్లు తగలడంతో మైసయ్య అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. తన కొడుకు మహేష్ తండ్రిని రక్షించడానికి వెళ్లడంతో మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. మృతుడి భార్య భీమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటోలో నుంచి జారి పడి ఒకరి మృతి

తానూర్ , ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగన్‌గావ్ గ్రామానికి చెందిన ఎల్మే దిలీప్ అనే వ్యక్తి ఆటోలోంచి కింద పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాల ప్రకారం... దిలీప్ గత కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధ పడుతుండేవాడు. గురువారం తానూర్‌కు పని నిమిత్తం వచ్చిన దిలీప్ పని ముగించుకొని తిరుగుప్రయాణంలో భాగంగా ఆటోస్టాండ్‌కు చేరుకొని అక్కడ ఆగి ఉన్న ఆటోలో నిద్రపోయాడు. కాగా రాత్రి 8గంటల సమయంలో ఆటో నుంచి క్రింద పడి రోడ్డుపై పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ మేరకు భార్య మంగళబాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

తానూర్ , ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెంబర్ గ్రామానికి చెందిన చుక్కబొట్ల సాయిలు అనే రైతు యొక్క లేగ దూడ చిరుత పులి దాడిలో మృతి చెందింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు బుధవారం రాత్రి తన కున్న వ్యవసాయ చేనులో ఆవు, లేగ దూడ కట్టి , చేన్లో వేసిన మక్క పంట కావాలికి వెళ్ళి రాత్రికి అక్కడే నిద్రించారు. గురువారం తెల్లవారు జామున వచ్చి చూసే సరికి వ్యవసాయ చేనులోని పరిసర ప్రాంతంలోని చెట్ల పొదల్లో లేగదూడ కళేబేరాం కనిపించింది. దీంతో రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా చిరుత పులి దాడిలో మృతి చెందినట్లు వారు నిర్ధారించారు. కళేబేరం వద్ద బీట్ ఆఫీసర్ కృష్ణ సీసీ కెమెరాను అమర్చగా, చిరుత కెమెరాకు చిక్కలేదు. చిరుత సంచారం ఉన్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికలను సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సీఈవో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించి, ఫిబ్రవరి 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని సీఈవో సూచించారు. అలాగే ఎన్నికల సిబ్బందికి శిక్షణ అందించాలని, బ్యాలెట్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను అనువైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించాలని సూచించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని నిర్మల్, భైంసా డివిజన్‌లలోని మండల కేంద్రాల్లో మొత్తం 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 21 లోకేషన్‌లలోని పోలింగ్ కేంద్రాలను 8 రూట్లలో విభజించామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని, ర్యాంప్, వీల్‌చైర్, త్రాగునీరు, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తున్నామని, ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే శిక్షణలు అందించామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్మర్ యాక్షన్‌ప్లాన్‌పై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవికాలంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గడం, నీటి మట్టాలు పడిపోవడం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న జలాశయాలు, బోర్లు, చెరువుల స్థితిని సమీక్షించాలని, తాగునీటి మూలాలను పరిశుభ్రంగా ఉంచి, తాగునీటి కొరత ఎదురవుతున్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని ఆదేశించారు. నీటి పొదుపు, సరైన వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ, నీటి పారుదలశాఖ అధికారులు పంటలకు నీటి కొరత రాకుండా రైతులతో సమీక్షించి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా అధిక ఉష్ణోగ్రతల వలన చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, ఉపాధి హామీ కూలీలు, సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక కేంద్రంలో అవసరమైన మందులను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎండాకాలంలో అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా అటవీ, సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లోని ఆయా వార్డుల్లో తాగునీటి కొరతను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. బోరు బావులకు అవసరమైన మరమ్మతులు చేయించాలని సూచించారు. అలాగే 2బీహెచ్‌కే ప్రాంతాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన నీటిని నిరంతరం సరఫరా చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి నాగిని భాను, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, డీసీహెచ్‌వో సురేష్, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రాసిమెట్ల ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్

మెరుగైన విద్యను అందించాలి

మామడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులందరికీ మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం రోజున మామడ మండలం రాసిమెట్ల ప్రభుత్వ ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, సరుకుల గదులను పరిశీలించి ప్రతి రోజు విద్యార్థులందరికీ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో నిరంతరం మెరుగైన పారిశుద్ధ్యాన్ని నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పాఠశాలకు హాజరవుతూ వందశాతం విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న స్టాక్, అటెండెన్స్ తదితర రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అన్ని తరగతుల విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షలను నిర్వహిస్తూ వారి సామర్థ్యాలను పరీక్షించాలన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం

పెంబి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండలంలోని రాయదారి గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలతో మాట్లాడుతూ... అగ్నిప్రమాద ఘటన దురదృష్టకరమన్నారు. ఈ ఘటనలో 8 ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, బాధిత కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయం కింద వెంటనే బాధితుల ఖాతాల్లోకి లక్ష రూపాయలు జమ చేస్తామని తెలిపారు. వారికి నిత్యావసర సరుకులు, బట్టలను అందజేశారు. బాధితులు యథాస్థితికి చేరుకునే వరకు వారికి భోజనం అందించాలని, రాత్రి బస చేసేందుకు ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. బాధితులు నూతన ఇళ్ల కోసం అధికారులకు తమ వివరాలను అందజేయాలన్నారు. నూతన ఇళ్ల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. బాధితులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, జిల్లా యంత్రాంగం వారికి అండగా ఉంటారని ధైర్యం చెప్పారు. అనంతరం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో అగ్ని ప్రమాద బాధితులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి కోరారు. శుక్రవారం పెన్షనర్ల సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి సీఎం రేవంత్‌రెడ్డి నేతృ త్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఎన్నికల హామీలు నెరవేరుస్తుందన్నారు. గ్రూప్-1 పరీక్షలు నిర్వహించిందని, 55 వేల మందికి ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని అన్నారు. డీఎస్సీ నిర్వహించి పది వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిందని, బదిలీలు, పదోన్నతులు కల్పించిందన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షులు కే.శ్రీహరిరావు, పెన్షనర్ల సంఘ జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న, జిల్లా కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, ఏఎంసీ భీమ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గణేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం

సారంగాపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రభుత్వ ఉద్యోగులకు, యువకులకు న్యాయం జరుగుతుందని విత్తన అభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రంలో మార్పు రావాలని ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు, ఏఎంసీ ఛైర్మన్‌లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, మండల పార్టీ అధ్యక్షులు బి. నర్సయ్య, మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎర్రవోతు రాజేందర్, నాయకులు దశరథ్ రాజేశ్వర్, రాజ్‌మహ్మద్, చించోలి శ్రీనివాస్‌రెడ్డిలు ఉన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా ఈ నెల 24వ తేదీన జరగనున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్ శుక్రవారం కోరారు. రానున్న సోమవారం ఉదయం 11 గంటలకు కొండాపూర్ గ్రామంలోని చంద్రశేకర్ ఏసీ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలో గల పట్టభద్రులందరూ హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సైన్స్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ జె.సంగీత మాట్లాడుతూ మాతృభాషాలను రక్షించుకుంటే మన సంస్కృతి పరిరక్షించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ కెప్టెన్ జగ్రామ్ అంతర్వేది, భాషోపధ్యాయులు రడాపు సంతోష్‌కుమార్, డిఎస్ చక్రవర్తి, గోలి సంజీవ్, నంద కుమార్, రాధ, సుమయ్య సుల్తానా, అధ్యాపకులు పాల్గొన్నారు.

హస్నాపూర్‌లో యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగొద్దని తల్లిదండ్రులు మందలించారని కొడుకు జాదవ్ వెంకటేష్ (26) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. హస్నాపూర్‌కు చెందిన జాదవ్ బాలుసింగ్ కుమారుడు ఎలాంటి పనిచేయకుండా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేసి బాగుండాలని గురువారం రాత్రి తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో అందుబాటులో ఉన్న పురుగుల మందు తాగి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం కొడుకుని లేపడానికి తల్లి ప్రయత్నించగా మృతిచెంది ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శవపంచానామా జరిపి కేసునమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించామన్నారు.

'పాత బకాయిలు చెల్లించండి'

నేరడిగొండ, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలు వ్యవసాయ రుణాలు తీసుకున్నవారు, దీర్ఘకాలంగా చెల్లించని వారికి 75శాతం మాఫీ చేస్తున్నామని, మిగిలిన డబ్బులను ఈనెల 25లోపు చెల్లించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్‌అధికారి పవన్ అన్నారు. గురువారం బుగ్గరాం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించడం వలన కలిగే లాభాలు వివరించారు. ప్రభుత్వ పథకాలపై ఇన్సూరెన్సుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌వో సర్వేష్, ఐకేపీ సీసీ పోసాని, సీపీ అఖిల, గ్రామమహిళా సమాఖ్య అధ్యక్షురాలు అఖిల, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ ఆధీనంలో ఉన్న రోడ్డు సమస్యలకు పరిష్కారం చూపాలి: తుడుందెబ్బ

నార్నూర్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో వెనుకబడిన మండలాలైన నార్నూర్, గాదిగూడ మండల ప్రజలకు ఫారెస్ట్ ఆధీనంలో ఉన్న రోడ్డుతో చాలా సమస్యలు ఎదురవుతున్నాయని, వెంటనే రోడ్డు సమస్యలకు పరిష్కారం చూపి, రోడ్డు వేసేందుకు అనుమతి ఇవ్వాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందుర్ దాదిరావు ఆదివాసీ సంక్షేమ పరిషత్ గాదిగూడ మండల ప్రధాన కార్యదర్శి పెందుర్ సంతోష్ శుక్రవారం జిల్లా డీఎఫ్ఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

బాధ్యతగా పనిచేయండి

● సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి: భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ

బోథ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపును తమ గెలుపుగా భావించి కార్యకర్తలు బాధ్యతతో పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రచారం చేయాలని ప్రతిఒక్కరూ పట్టభద్రులను కలిసి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. పేదలకు రేషన్ కార్డుల మంజూరు, రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక పథకాలను చేపట్టిందని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సహకార బ్యాంక్ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జిల్లా ఇన్‌చార్జి సత్తు మల్లేష్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, వేణుగోపాల, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, అధికార ప్రతినిధి గాదరి కిషోర్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ జెడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

తూకం కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



తూకం కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



రంజాన్ ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చెర గ్రామం శివారులో శుక్రవారం శనగల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు. ఈ సందర్భంగా తూకం వివరాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అం తర పంటల దిగుబడి వివరాలు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు తదితర అంశాలపై చర్చిం చారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రంజాన్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

రంజాన్ పండుగ ఏర్పాట్లు పకడ్బందీగా చేప ట్టాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మార్చి 2 నుంచి ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మసీదులు, ఈద్గాల వద్ద నీటి వసతి, వీధి దీపాలు, కరెంటు సౌకర్యం కల్పించారు. ముఖ్యంగా శానిటేషన్ చేయించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాకు చేరకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్



రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు పూల మొక్కను అందజేస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అదిలాబాద్ జిల్లాకు చేరుకున్నారు. పర్యటనలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆమెకు పెన్‌గంగా గెస్ట్ హౌస్ వద్ద జిల్లా కలెక్టర్ రాజర్షి షా పూల మొక్క అందించి స్వాగతం పాలికారు. అనంతరం కాసేపు ఇరువురు పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాస్‌రెడి

కాంగ్రెస్ పార్టీలోకి పలువురి చేరికలు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో పార్టీలోకి చేరికలు ఊపందుకుంటున్నాయి. ఆయన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్‌లో జరిగిన చేరికల కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్ హాజరయ్యారు. ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొండూరి రవి నాయకులు సోప్పవార్ అజయ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌కు చెందిన గ్యాద్యు యేట్లతోపాటు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సాంగ్వి నుంచి ఆత్రం నగేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బీజేపీ నుంచి పెద్ద సంఖ్యలో గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్ రావు,అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు.

బాలల హక్కులకు భంగం కలిగించొద్దు

బోథ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులకు భంగం కలిగించొద్దని, ఒకవేళ వారి హక్కులకు హరిస్తే 1098కు ఫోన్ చేయాలని చాగంటి హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు చైల్డ్‌హెల్ప్ లైన్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే 1098కు ఫోన్ చేయాలని వివరించారు. పోక్సోచట్టంపై విద్యార్థులకు వివరించారు. ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపుమేరకు భారతదేశాన్ని బాల్య వివాహాల నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు చదువులపై శ్రద్ధ చూపించాలని తల్లిదండ్రులకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీయూ కౌన్సిలర్ మాట్లాడుతూ చిన్నపిల్లల పెళ్లిళ్ల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించడం జరిగింది. పిల్లలలో గుడ్డు టచ్ బ్యాడ్ టచ్ విషయమై వివరించారు. కార్యక్రమంలో డీసీపీ సోషల్ వర్కర్ రవికాంత్, డీసీపీయూ వర్కర్, అశ్వని, ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ సంగీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్

ఆ మాజీలకు ఏమైనట్లు!

(5వ పేజీ తరువాయి)

ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఇతర ముఖ్య నేతల పర్యటనలోనైనా సీనియర్ నేతలు కనిపించడం లేదంటున్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సీనియర్ నేతల వ్యవహారం అంతుచిక్కకపోవడంతో నియోజకవర్గాల్లో పార్టీ క్యాండేట్ అయోమయానికి గురవుతున్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వ కార్యక్రమాలు సంక్షేమ పథకాల అమలుపై తీవ్ర విమర్శలు చేస్తున్న సీనియర్ నేతలు ధీటైన సమాధానం ఇవ్వకలేకపోతున్నారన్నా విమర్శలు వస్తున్నాయి. ప్రతీ నియోజకవర్గంలో నేతల మధ్య గ్రూపు విభేధాలు, ఆధిపత్య పోరుతో ఐక్యత కనిపించడం లేదంటున్నారు. ఇకనైనా పార్టీలో నెలకొన్న పరిస్థితులను చక్కబెట్టుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్న వాదనలు వినిపిస్తున్నాయి.



టవర్ ఎక్కిన సఫియొద్దీన్



సీఐ సూచనలతో టవర్ దిగివచ్చిన సఫియొద్దీన్

భార్య కాపురానికి రావడం లేదంటూ సెల్‌టవర్ ఎక్కిన భర్త

● నాలుగు గంటలు హైడ్రామా

ఉట్నూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తన భార్య కాపురానికి రావడం లేదంటూ ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన సఫియొద్దీన్ సెల్ టవర్ ఎక్కి శుక్రవారం హైడ్రామా సృష్టించాడు. ఉట్నూర్‌కు చెందిన సఫియొద్దీన్‌కు కెరమెరి మండలానికి చెందిన ముస్కాన్‌తో వివాహమైంది. ఇటీవల వీరికి పాపకు జన్మించడంతో భర్తతో ఇంట్లో గొడవలు జరిగి ముస్కాన్ తల్లిగారి ఇంటికి వెళ్లి పోయింది. భార్య కాపురానికి రావడం లేదంటూ సఫియొద్దీన్ టవర్ ఎక్కగా.. అతడిని కిందికి దింపేందుకు 4గంటల పాటు పోలీసులతో పాటు, అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నించారు. తన భార్య కెరమెరి పోలీసులకు తనపై ఫిర్యాదు చేసిందని, ఫిర్యాదు వెనక్కి తీసుకుని తన సమస్యను పరిష్కరిస్తే కిందికి వస్తానని చెప్పిడంతో సీఐ కెరమెరి పోలీసులను సంప్రదించారు. అక్కడ కేసు నమోదు కాలేదని సముదాయించడంతో సఫియొద్దీన్ టవర్ దిగాడు.

ఎమ్మెల్యేను సత్కరించిన ఖానాపూర్ ఎమ్మెల్యే దంపతులు



ఎమ్మెల్యే సత్యనారాయణ రావును సన్మానిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే

ఉట్నూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎమ్మెల్యే నివాసంలో ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ దంపతులు భూపాలపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణరావును శాలువాతో సన్మానించారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు ఉట్నూర్‌లో ఉన్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆయన సతీమణి దృపత భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావుని శాలువాతో సత్కరించి స్వాగతం పాలికారు. ఈ సందర్భంగా ఇరువురు ఎమ్మెల్యేలు పలు విషయాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఆర్మీ జవాన్ దంపతులపై దాడి

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోత) : మండలంలోని గొల్లమాడ గ్రామంలో గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఆర్మీ జవాన్ భోజరాజు భార్య మాస్కిరి కావేరిపై ఇంటికి పైకి వచ్చి ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అరుణాచల్‌ప్రదేశ్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవాన్ నూత న గృహ ప్రదేశం కొరకు సెలవుపై తన సొంత గ్రామం గొల్లమాడకు వచ్చాడు. గతంలో చదువుకునే రోజుల్లో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన అమ్మాయితో చనువుగా ఉండేవాడు. అమ్మాయి వివాహం జరగడంతో మంజులాపూర్ గ్రామంలో ఉంటుంది. గత కొన్ని రోజుల నుండి అమ్మాయి ఫోన్‌లో వేధింపులకు గురి చేస్తోందని ఆర్మీ జవాన్ అమ్మాయి తండ్రి గోస్కుల భూమయ్య, ఆమె భర్తకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో అమ్మాయి తండ్రి గోస్కుల భూమయ్య అమ్మాయి మేనమామ ఈర్ల పోశెట్టి ఇంట్లోకి ప్రవేశించి వారి వెంట తెచ్చుకున్న కట్టెలతో ఒక్కసారిగా ఆర్మీ జవాన్ భోజరాజు తలపై మోదారు. భార్య కావేరి అడ్డు రావడంతో ఆమెపై కర్రతో దాడి చేశారు. ఆర్మీ జవాన్ భార్య కావేరి తన బావ అయిన భాస్కర్ లక్ష్మణ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. వెంటనే టాటా వాహనంలో వైద్యం కోసం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తమ్ముడు ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి దాడి చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని మాస్కిరి లక్ష్మణ్ ఫిర్యాదు చేయడంతో సెక్షన్ 118(1), 333 బీఎన్ఎస్‌లతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయి కిరణ్ తెలిపారు.

సబ్ స్టేషన్ ముట్టడించి రైతుల నిరసన

లోకేశ్వరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్మథ్ గ్రామంలో 33/ 11 కేవీ సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం రైతులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మొక్కజొన్న, వరి పంటలు ఎండిపోతున్నాయని, సబ్ సెంటర్ నుంచి విద్యుత్ సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరఫరా ఎప్పుడు ఆగిపోతుందో, విద్యుత్ ఎప్పుడు సరఫరా చేస్తారో తెలియపరచడం లేదన్నారు. ఇకనైనా విద్యుత్ సరఫరా నిరంతరంగా కొనసాగాలని రైతులు ఎఇని కోరారు. లేని పక్షంలో పెద్ద మొత్తంలో రైతులతో నిరసనలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

తానూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోల్సా గ్రామంలో ఓ వివాహిత బెల్లిడిగ నవనీత(22) ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాల ప్రకారం... మృతురాలు 3నెలల గర్భవతి. అయితే గురువారం నవనీత కుటుంబ సభ్యులు సీమంతం ఫంక్షన్‌కు వెళ్తుండగా తాను కూడా వస్తా అనడంతో గర్భంతో ఉన్నావు కదా వద్దు అని మృతురాలి తండ్రి బక్కన్న, కుటుంబ సభ్యులు నిరాకరించి వెళ్లి పోయారు. అదే విధంగా తన తండ్రి బక్కన్న నవనీతను ఇంట్లో ఉంచి చేన్లోకి వెళ్లిపోయాడు. దీంతో మనస్థాపానికి గురయిన నవనీత సాయంత్రం చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన చుట్టు పక్కల వారు బక్కన్నకు సమాచారం అందించడంతో ఆయన ఇంటికి చేరుకొని తలుపులను పగల గొట్టి చూసేసరికి నవనీత మృతి చెంది ఉంది. ఈ మేరకు బక్కన్న ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆల్ ఇండియా సదస్సు జయప్రదం చేయండి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 28న ఢిల్లీలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నిర్వహించే ఆల్ ఇండియా సదస్సు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కే. రాజన్న పిలుపునిచ్చారు. శుక్రవారం కరపత్రాలు విడుదల చేశారు. పాసిస్టు, కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమైక్య వాదాన్ని కాపాడుకు నేందుకు ఫెడరలిజాన్ని రక్షించేందుకు అన్ని శక్తులు ఏకం కావాలన్నారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవాలి

● బీజేపీ శ్రేణులకు ఎంపీ నగేష్, ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్‌ల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంట్ సభ్యుడు గెడం నగేష్

భైంసా,ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మరో ఐదు రోజుల వ్యవధిలో జరుగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపేందుకు బీజేపీ ఎన్నికల ఇంచార్జీలు, ప్రబారీలు బాధ్యతాయుతంగా పాటుపడాలని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో భైంసా డివిజన్ పార్టీ ఎన్నికల ఇంచార్జీలు, ప్రబారీలతో సమావేశం నిర్వహించి దిశ, నిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ శ్రేణులన్నీ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఇందులో పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జీ హరినాయక్, ముథోల్ నియోజక వర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్‌కో కన్వీనర్ సుమన్, పార్టీ ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగర్ నారాయణరెడ్డి, గోపాల్ సర్డా, బోస్లే బాజీరావ్ పాటిల్, భైంసా పట్టణ, మండల అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్, సుష్మారెడ్డి, భైంసా పట్టణ ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ బండారీ దిలీప్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ ప్రవీణ్, పార్టీ సీనియర్ ప్రతినిధులు జాదవ్ రాజేష్ బాబు, బి.గంగాధర్, సోలంకే భీంరావ్ పాటిల్, బోస్లే పండిత్‌రావ్ పాటిల్, అల్లెం దిలీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేలా కృషి చేయాలి

ముథోల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన ముథోల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డిల గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. ఢిల్లీ విజయాన్ని ప్రేరణగా తీసుకోవాలన్నారు. తదుపరి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. శనివారం భైంసా పట్టణంలో నిర్వహించే సమావేశంకు కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి వస్తున్నారని ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పట్టభద్రులు హాజరయ్యే విధంగా ఇన్‌చార్జీలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిలీష్ రాథోడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, హరి నాయక్, శివ చంద్రగిరి, సాయినాథ్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, చిన్నారెడ్డి, బాజీరావు పటేల్, మోహన్ రెడ్డి, నారాయణ రెడ్డి, సంతోష్, దేవోజీ భూమేష్, నిమ్మ పోతన్న, లక్ష్మీనారాయణ, దేవన్న, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కుభీర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ గెడం నగేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కుభీర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. బీజేపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యను మొదటి ప్రాధన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే రామరావుపాటిల్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో నాయకులు వడ్నం నాగేశ్వర్, హరినాయక్, శివచంద్ర, నారాయణరెడ్డి, విఠల్, శంకర్, శేఖర్, సాయినాథ్, గంగాధర్, దత్తాత్రి, గులాబ్ , వెంకటస్వామి ఉన్నారు.

భారతీయ జనతాపార్టీతోనే అన్ని వర్గాల వారికి న్యాయం

కుంటాల, ఫిబ్రవరి, 21 : (ఆంధ్రజ్యోతి) : అటు కేంద్రంలోను ఇటు రాష్ట్రంలోను భారతీయ జనతాపార్టీతోనే అన్ని వర్గాల వారికి న్యాయం చేకూరుతుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంపీ గోడం నగేష్ అన్నారు. భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం కుంటాలతో పాటు కల్లూర్ గ్రామాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి తరఫున ఎంపీ గోడం నగేష్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్ ప్రచారం నిర్వహించారు. అనంతరం కుంటాల హైస్కూల్‌లో ఇది వరకు విధులు నిర్వహించిన పదవీ విరమణ పొందిన సగ్గం గంగాధర్‌ను వారు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అప్కగజ్జారాం యాదవ్, నాయకులు నారాయణరెడ్డి, జక్కుల గజేందర్, రమేష్ గౌడ్, పసుల నవీన్, రమణ రావు, గంగయ్య, పలువురు నాయకులు, తదితరులు ఉన్నారు.

చిరుతపులి సంచరిస్తుందని రైతుల భయాందోళన

భైంసా రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండలంతో పాటు తానూర్ మండలంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. రాత్రివేళలో భైంసా మండలం సిరాల గ్రామ శివారులోని పంట చేనులో కుక్కను చంపి తిన్నట్లు, అదేవిధంగా తానూర్ మండలం బెంబర్ గ్రామంలో లేగదూడను చంపి తిన్నట్లు రైతులు తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారులు చిరుతపులి అడుగులను గుర్తించి చిరుత పులి పిల్లగా గుర్తించారు. లేగదూడ కళేబరాన్ని ఉంచిన దగ్గర అధికారులు కెమెరాను అమర్చగా అందులో ఎలాంటి ఆధారాలు లేవు. గత మూడు సంవత్సరాలుగా ప్రతియేడు చిరుతపులి తమ పశువులను తింటుందని రైతులు ఆవేదన చెందారు.

భవన నిర్మాణ కార్మికులకు హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణరంగంలో పనిచేసే కార్మికులకు కార్యాలయంలో హెల్ప్‌లైన్‌డెస్క్ ఏర్పాటు చేసినట్టు ప్రవాసి మిత్ర కార్మిక సంఘం అధ్యక్షుడు పి. స్వదేశ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కార్మికుల పేర్ల నమోదు ఇతర సమస్యల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్ ఉపయోగించుకోవాలని సూచించారు.

ప్రేమించుకున్నారు.. ఒక్కటయ్యారు

● కులాంతర వివాహం కావడంతో భద్రత కల్పించాలని పోలీసుస్టేషన్‌కు నూతన దంపతుల

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన కాసారం మురళి, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పడిగెల ఓమేశ్వరి దిలావర్‌పూర్ గ్రామంలోని కాలేజీలో చదువుకున్నారు. రెండు సంవత్సరాల కాలంలో బైపీసీ చదువుతున్న మురళి, ఎంఎల్‌టీ చదువుతున్న ఓమేశ్వరి స్నేహం కాస్త ప్రేమగా మారింది. శుక్రవారం దంపతులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని నందిగుండం ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. కులాంతర వివాహం కావడంతో ఓమేశ్వరి కుటుంబ సభ్యులు ఒప్పుకోకపోవడంతో వారి నుండి రక్షణ కల్పించాలని నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

దారి వదిలి ప్రహరీ నిర్మించాలని భైంసా డీఎంకు వినతి

కుభీర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లోని నయాబాది(గణేష్‌నగర్) వాసులు శుక్రవారం భైంసా ఆర్టీసీ డీపో డీఎంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం కుభీర్‌లోని బస్టాండ్ లో నిర్మిస్తున్న ప్రహరీ గోడ వలన నయాబాదికి వెళ్లే ప్రధాన రోడ్డు మూసుకు పోయే అవకాశాలున్నాయి, కాబట్టి ఎట్టి పరిస్థితులలో ప్రధాన రహదారికి దారి వదిలిన తర్వాత మాత్రమే ప్రహరి గోడ నిర్మించాలని డీఎంను కోరినట్లు తెలిపారు.

అభివృద్ధి నిరోధకుడు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

● మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



వృథాగా పడి ఉన్న అమృతపథకం పైప్‌లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి అల్లోల

సోన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పర్యటించారు. దారి పొడవునా వృథాగా పడి ఉన్న అమృత పథకం పైప్‌లను చూసి మాజీ మంత్రి అల్లోల చలించిపోయారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్మల్ పట్టణ ప్రజల నీటి తిప్పలను పరిష్కరించేందుకు అమృత పథకం కింద రూ.62 కోట్లు మంజూరయ్యాయయని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టవలసి ఉండగా ఆ పనులు కాకుండా ఎమ్మెల్యే ఏలేటి అడ్డుపడడం శోచనీయమన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, నిర్మల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ ప్రసాద్ రెడ్డి, రమణారెడ్డి, మాజీ సర్పంచ్ వినోద్ కుమార్, శ్రీకాంత్ యాదవ్, ఎంపీటీసీ సంతోష్, నిర్మల్ మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు పొలాస మల్లేష్, ఇతర నాయకులు, కార్యకర్తలు, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి అల్లోల పరామర్శ

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముజ్గి గ్రామంలో బద్దం నారాయణరెడ్డిని శుక్రవారం రోజు మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల గుండె ఆపరేషన్ కావడతో ఇంటి వద్దకు వచ్చి యోగక్షేమాలు తెలుసుకొని అన్ని రకాలుగా అండగా ఉంటానని చెప్పారు. ఆయనతో పాటు అల్లోల మురళీధర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, కృష్ణప్రసాద్‌రెడ్డి, పాకాల రామచందర్, వినోద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భవతులకు వెంటనే సేవలందించండి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అధిక ప్రమాద గర్భవతులను వెంటనే గుర్తించి అవసరమైన సేవలందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ సూచించారు. శుక్రవారం మహిళా ఆరోగ్య సహాయకులకు శిక్షణ నిర్వహించారు. గర్భవతులకు సమయానుకూలంగా సేవలనందిస్తే ఎటువంటి ఆరోగ్యపర ఇబ్బందులు లేకుండా ప్రసవం అవుతారని అందుకు చర్యలు చేపట్టాలన్నారు. హై రిస్క్ గర్భవతులను గుర్తించేందుకు ఈ శిక్షణ ఇచ్చారు. డాక్టర్లు అఖిల, సంతోషిని, సౌమ్య, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువును తయారు చేయాలి

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి నాణ్యమైన ఎరువును తయారు చేయాలని ఎంపీడీవో రాధారాథోడ్ శుక్రవారం అన్నారు. మండల కేంద్రమైన లక్ష్మణచాంద గ్రామ పంచాయతీలో సమావేశం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ... ఎక్కడ కూడా పారిశుద్ధ్య లోపం లేకుండా సిబ్బంది పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేష్, ఎంపీవో, ఎంపీడీవో, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బి. పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన



రాజరాజేశ్వర ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్న కమిటీ నాయకులు

రాజ రాజేశ్వర జాతరకు ఏర్పాట్లు పూర్తి

కుభీర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(బి) గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. ఈ జాతరకు మండలంతో పాటు నియోజకవర్గ ప్రజలు పొరుగు మహారాష్ట్ర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకుంటారు. ఈ నెల 26 నుంచి 5 రోజుల పాటు జాతర, 27న రాత్రి 12 గంటలకు శివపార్వతుల కళ్యాణం, 28న భక్తుల అభిషేకాలు, అర్చనలు , మార్చి 1న అంబళ్ల పండగ వేడుకలు, 2న మధ్యాహ్నం 1 గంటల నుంచి కుస్తీ పోటీలు, రాత్రి నాగవెల్లి కార్యక్రమాలు జరిపిన తరువాత జాతర ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కవాలని పిలుపునిచ్చారు.

ఆలయంలో కొనసాగుతున్న పూజలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ మంత్రి అల్లోల

సోన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లోకల్ వెల్మల్ గ్రామంలోని నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడో రోజైన శుక్రవారం పెద్దఎత్తున భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎంబడి గంగాధర్, మాజీ సర్పంచ్ రాజేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్ రెడ్డి, రమణ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వినోద్ కుమార్, మల్లేష్, మాజీ ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ యాదవ్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో ఘనంగా ఊరేగింపు



విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్‌లో విగ్రహాల ఊరేగింపును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించే పలు విగ్రహాలను మహిళల మంగళ హారతుల స్వాగతాలు, యువకుల నృత్యాల మధ్య ఈ ఊరేగింపు కొనసాగింది. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బాబాపూర్‌లో నేడు శివ పార్వతుల కల్యాణం



బాబాపూర్‌లోని రాజరాజేశ్వర ఆలయం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్ గ్రామంలో గల రాజరాజేశ్వర ఆలయంలో శనివారం శివ పార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. శివరాత్రి పర్వదినానికి ముందు ఈ కళ్యాణం నిర్వమించటం ఆనవాయితీగా కొనసాగుతున్నట్లు వారు వివరించారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

సంత్ సేవాలాల్ జయంతిని విజయవంతం చేయండి

● సేవాలాల్ ధర్మ ప్రచారక్ ఆడే ప్రేమ్ మహరాజ్

నేరడిగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం జరిగే గోర్ పంచాద్‌లో సేవా లాల్ ధర్మ ప్రచారక్ ఆడే ప్రేమ్ మహరాజ్ పాల్గొని మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతీ తండాల నాయక్, కారోబారి డావ్, గేర్య మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, సమస్త బంజారా ప్రజలకు ఈనెల 24న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రామ్‌లీలా మైదానంలో జరిగే సంత్ సేవాలాల్ జయంతి మహోత్స వానికి ప్రతీ తండా నుంచి భక్తులు పాల్గొని సంత్ సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలని కోరారు.

రైతుకు అప్పు ఇచ్చానని..

రిజిస్ట్రేషన్ ఆపే ప్రయత్నం!

● రైతుకు న్యాయం చేసిన తహసీల్దార్

భీంపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఒక చిన్న రైతు కుటుంబం అవసరం వుండి భూమి అమ్ముకునేందుకు నిర్ణయించుకున్నారు. అందుకు సంబంధించి స్లాట్ నమోదు చేసుకున్నారు. అమ్మేవారు కొనే వారు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోగా మధ్యన ఒక దళారీ వచ్చి భూమి అమ్మే రైతు తనకు బాకీ ఉన్నాడని గందరగోళం సృష్టించగా చివరకు కథ సుఖాంతం అయింది.. వివరాలు ఇలా ఉన్నాయి. భీంపూర్ మండలం పిప్పల్ కోటికి చెందిన పేద రైతు కుటుంబీకులు తమకు అవసరం వుండి పిప్పల్ కోటి శివారులోని 3 ఎకరాల సొంత భూమిని వేరే రైతుకు అమ్మటానికి సిద్ధం అయ్యాడు. అందుకు సంబంధించి స్లాట్ బుక్ కాగా శుక్రవారం భీంపూర్ తహసీల్దార్ కార్యాలయానికి అమ్మే రైతు కొనే రైతు చేరుకున్నారు. ఈ క్రమంలో సదరు రైతు తుమ్మల పంచాపుల తనకు రూపాయలు 23 లక్షల బాకీ ఉన్నారని అది తీర్చే వరకు రిజిస్ట్రేషన్ ఆపాలని పిప్పల్ కోటికి చెందిన ఒక దళారీ తప్పుడు డాక్యుమెంట్‌ను సృష్టించి తహసీల్దార్ అధికారులను తప్పుదారి ప్రయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ అవుతున్నామని తహసీల్దార్ నలందా ప్రియ చెప్పగా బాధిత రైతు దంపతులు బోరున విలపించారు. తాము నీ దగ్గర 23 లక్షలు ఎప్పుడు తీసుకున్నాము చెప్పాలని సదరు మధ్య దళారిని నిలదీశారు. కేసులు పెడతామని చెప్పడంతో భయపడిన దళారి తప్పు ఒప్పుకున్నాడు. ఈ భూమి అమ్మకం వ్యవహారంలో తనకు కమీషన్ రాకనే ఇలా చేశానని అంగీకరించాడు. కాగా ఈ వ్యక్తి తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చిన నోటరీలో బాకీ ఒప్పుకున్నట్లు రైతు పంచాపుల సంతకం, సాక్షి సంతం కూడా అతనే చేసినట్లు స్పష్టం అవుతున్నది. ఈ మొత్తం వ్యవహారం తెలుసుకున్న తహసీల్దార్ ఆ వ్యక్తిని మందలించి పంపేశారు. అధికారులను తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతిమంగా తహసీల్దార్ సకాలంలో స్పందించటంతో కథ సుఖాంతం అయ్యింది.

ఉద్యాన పంటల సాగు.. బహుబాగు

● జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ



రైతుకు ఆయిల్‌పాం రాయితీ ఎరువులను అందజేస్తున్న జిల్లా ఉద్యాన శాఖఅధికారి రమణ



బిందు సేద్యం పరికరాలను పరిశీలిస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుతో రైతులు మంచి దిగుబడితో పాటు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి బీవీ రమణ అన్నారు. మండలంలోని దిలావర్‌పూర్, నర్సాపూర్, బన్సపల్లి, గుండంపల్లి, సముందర్ పల్లి, చర్లపల్లి, టెంబుర్ని గ్రామాల్లో ఆయిల్‌పాం తోటలతో పాటు బిందు, తుంపర సేద్య పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఎరువుల వాడకం, నీటి యాజమాన్య పద్ధతులను వివరిం చారు. ఉద్యాన శాఖ ఇచ్చిన రాయితీ బిందు, తుంపర సేద్య పరికరా లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయిల్ పాం తోటలతో పూ గెలలను 34 నెలల వరకు తొలగించాలని చెప్పారు. జిల్లా అధికారి వెంట ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ మండల అధికారి సాదుల మౌనిక, డ్రిప్ కంపెనీ డీసీవో, అయిల్ పాం క్లస్టర్ ఆఫీసర్స్ శేఖర్, శ్రీనివాస్ ఉన్నారు.

ఆయిల్ పాం తోటల పరిశీలన

సోన్: మండలంలోని పాక్‌పట్ల, మాదాపూర్, లోకల్ వెల్మల్ గ్రామాల్లో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి బీవీ రమణ శుక్రవారం ఆయిల్ పాం తోట, బిందు సేద్యం పరికరాలను పరిశీలించారు. రైతులకు ఎరువులు, నీటి యాజమన్యంపై వివరించారు. ఉద్యాన శాఖ నుంచి 90 శాతం రాయితీతో ఇచ్చిన బిందు సేద్య పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సాదుల మౌనిక, ముత్యం రెడ్డి, శేఖర్, మధు, రైతులు పాల్గొన్నారు.



కడెంలో ఒకేచోట చేరిన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ'ం.. విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కడెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కడెం ప్రభుత్వ పాఠశాలలో పదవ తగరతి చదివిన పూర్వ విద్యార్థులు 36 ఏళ్ల తర్వాత ఒకేచోట కలిశారు. 1988-89 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కడెంలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పుడు విద్య నేర్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

వారం రోజులు చికెన్ అమ్మకాలు బంద్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలో శుక్రవారం నుంచి చికెన్ అమ్మకాలు బంద్ చేయాలని నిర్వాహకులు నిర్ణయించారు. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ వల్ల చికెన్ కొనుగోలుపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో చికెన్ కొనుగోలు చేసేందుకు వినియోగదారులు వెనుకాడుతున్నారు. చేసేది ఏమి లేక వారం రోజులపాటు చికెన్ సెంటర్లు బంద్ చేస్తున్నారు. రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ లేనప్పటికీ వేరే రాష్ట్రాల్లో ఉన్నందున చికెన్ షాప్ యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విందు రాజకీయాలు

బోథ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది విందు వినోదాలు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఎమ్మెల్సీగా పోటీ చేసేవారు మండలానికి ఒకరిని ఇంచార్జిలుగా నియమించుకున్నారు అయితే వారు పట్టభద్రులకు విందు ఎరగా వేస్తున్నారు.

● ఫొటోలే ఆధారం

ఇన్‌చార్జీలుగా ఉన్నవారు ప్రచార పర్వాన్ని వినూత్న రీతిలో చేపడుతున్నారు. పట్టభద్రుల దగ్గరికి వెళ్లి ఫోటోలు దిగి పోటీ చేసే అభ్యర్థులకు పంపిస్తున్నారు. తాము చేస్తున్న ప్రచారాన్ని అభ్యర్థులకు చేరవేయడంతో తమకు మాట ప్రకారం ఇస్తామని డబ్బులు తీసుకుంటున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నది. అయితే కొంతమంది పట్టభద్రుల ఎన్రోల్మెంట్ నుండి ఎన్నికలు పూర్తయ్యేంతవరకు ఇదే పనులు నిమగ్నం అవుతున్నట్లు తెలిసింది.

● జనం లేక ఇన్‌చార్జీపై ఆగ్రహం

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి మండలాల వారీగా సమావేశాలను నిర్వహిస్తున్నారు. అయితే కొన్నిచోట్ల ఇన్‌చార్జీలుగా సరిగా స్పందించక పోవడంతో సమావేశానికి పట్టభద్రులు పార్టీ ముఖ్య కార్యకర్తలు రాక పోవడంతో ఆయా పార్టీలలోని సీనియర్ నాయకులు ఇంచార్జిలపై ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. బోథ్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో పట్టభద్రులు అతి తక్కువగా కనిపించగా ముఖ్య నాయకులు కార్యకర్తలు సహితం తక్కువగా ఉండడంతో మండల ఇన్‌చార్జీపై ఓ సీనియర్ నాయకుడు తీవ్రంగా మందలించినట్లు తెలిసింది.

ప్లాస్టిక్‌తో మృత్యువాత పడుతున్న పశువులు

● నిషేధం ఉన్నా పట్టించుకోని అధికారులు ● పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు

తలమడుగు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ అవి ఇక్కడ అమలు కావడం లేదని పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పర్యావరణ కాలుష్యానికి ముఖ్య కారణమైన ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా రూపుమాపడంలో అధికారులు విఫలమయ్యారు. వివిధ వస్తువులను కొనుగోలు చేసి వాటిని వినియోగదారులు ప్లాస్టిక్ కవర్‌లో తీసుకెళుతున్నారు. అంతేకాకుండా ప్రతీ వస్తువు ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్ చేయడంతో రాష్ట్రంలో ప్లాస్టిక్ భూతం మరింత ఉధృతము అవుతున్నాయి. వాటిని చెత్త రూపంలో బయటకు పారేయగా ఆ ప్లాస్టిక్‌లో కొంత తిను బండారాలు ఉండడంతో వాటిని పశువులు తిని మృత్యు వాత పడుతున్న ఎవరు పట్టించుకోవడంలేదని విమర్శలు వ్యక్తమవు తున్నాయి. తలమడుగు మండలం సుంకిడి గ్రామ సమీపంలో చెత్తాచెదారంతో పాటు ప్లాస్టిక్ కబుర్లు కనబడడంతో గ్రామానికి చెందిన పశువుల కాపరులు అందులోనే పశువులను మేతకు తీసుకురాగా కొన్ని పశువులు ప్లాస్టిక్ కవర్లు తిని గతంలో మృత్యువాత పడ్డ సంఘటనలో మర్చిపోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్త చెదారాన్ని ప్రతీరోజు చెత్త బండిలో తీసుకువచ్చి తగలబెట్టక పోవడంతో కుప్పలుగా పారవేయ డంతో ఆ ప్లాస్టిక్ కవర్లని పశువులు తినాల్సి వస్తుంది. ప్లాస్టి క్ కవర్లను ప్రతీ రోజు తగలబెట్టాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు గ్రామస్థులు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోయారు. అంతేకాకుండా సుంకిడిలో నిర్వహించే ప్రతీ ఆదివారం సంతలో ప్లాస్టిక్ కవర్ల వాడకం ఎక్కువగా ఉన్నా ప్లాస్టిక్ కవర్ల కవర్లను అరికట్టేందుకు ఇప్పటివరకు ఇలాంటి చర్యలు చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్ భూతాన్ని అరికట్టి పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడుతూ ప్లాస్టిక్ భూతం నుంచి పశువులు మృత్యువాత పడకుండా చర్యలు చేపట్టాలని పర్యావరణ పరిరక్షణ ప్రేమికులు కోరుతున్నారు.



తలమడుగు మండలం సుంకిడిలో ప్లాస్టిక్ కవర్ల మధ్య మేత మేస్తున్న పశువులు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బాసర, ఫిబ్రవరి, 21 (ఆంధ్రజ్యోతి): సైకాలజికల్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో క్యాంపస్ శాతవాహన గ్రౌండ్‌లో పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థినులు వివిధ రకాల సామూహిక నృత్యాలతో శుక్రవారం సందడి చేశారు. ఏరోబిక్ విన్యాసాలు, హిప్-హాప్, శాస్త్రీయ నృత్యం, సంగీతానికి వారి ఆధునిక నృత్యాలను క్రోడీకరించి ప్రదర్శించారు. ఆర్జీయూకేటీ లోగోను కూడా మానవహారంగా ప్రదర్శించ డం జరిగింది. దీనివల్ల విద్యార్థులలో సృజనాత్మక అభివృద్ధితో పాటుగా సమయ పాలన, మానసిక ఉల్లాసం పెంపొందుతాయని వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీ భవిష్యత్తుకు.. భరోసా మాది!

● విద్యార్థులకు ప్యాడ్‌లను అందజేసిన కళాశాల లెక్చరర్లు



విద్యార్థులకు ప్యాడ్‌లను అందజేసిన దృశ్యం

నేరడిగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మీ భవిష్యత్తుకు భరోసా మాది అంటూ ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కుమారి గ్రామంలో గల జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యపై అవగాహన కల్పించారు. అక్కడ విద్యార్థులకు ఇంటర్మీడియెట్‌కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సౌకర్యాల గురించి సైన్స్ ల్యాబ్, కళాశాల స్థితిగతుల గురించి వివరించారు. విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలకు వెళ్లి మోసపోవద్దన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే అడ్మిషన్లు పొందాలన్నారు. అంతకుముందు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు డాక్టర్ కొండ గోవర్ధన్, పి.భీంరావు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో విశ్వ విజేతకు ఘన సన్మానం



శివారెడ్డిని సన్మానిస్తున్న మౌనిష్ రెడ్డి, ఉత్సవ సమితి సభ్యులు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : భారత ఖోఖో జట్టు విశ్వ విజేత సభ్యుడు, ఆదిలాబాద్ పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగి శివారెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం ఆయనను స్థానిక తపాల శాఖ కార్యాలయంలో సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డితోపాటు సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ శాఖ అధికారి సిద్దార్థ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Adilabad branch, agreed to accord loan to Borrower : MUNDE AMOL S/o. DEVIDAS, R/o H.NO: 3-10, Village: Narsapur, Mandal: Ichoda, Dist.Adilabad. Property Holder : MUNDE DEVIDAS S/o KISHAN RAO, R/o H.No :3-10, Village: Narsapur, Mandal: Ichoda, Dist. Adilabad R/o, by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 7 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan

SCHEDULE

The Open Plot No.204, plot consisting 36' x 50' = 1800 Sft = 200 Sq Yards = 167.22 Sq Mtrs, in Sy No.181/2/1, 181/2/4 (part of principal Sy No.181/2) Sy.No.181/51 as per Sethwar. Situated at Mavala village, now within the limits of Municipality, Adilabad. Mandal Mavala, District Adilabad. within the jurisdiction of Registration District & Sub-District Adilabad

Bounded as follows:

East: Plot No.225, **West:** 30' Wide Road, **North:** Plot No.203, **South:** Plot No.205

Sd/- BIPIN KUMAR PATEL Advocate, Adilabad. Cell: 9440005500

ఫొటో న్యూస్

ఒకే గదిలో ఒకటి నుంచి 5 తరగతులు



అంగన్వాడీ కేంద్రంలో స్కూల్ టేబుల్ కుర్చీలు



ఒకే గదిలో ఐదు తరగతులు

బోరజ్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఒకే ఆవరణలో ఉండేది. అయితే కొత్తగా భూరాజు మండలం ఆవిర్భవించడంతో ప్రాథమిక పాఠశాలలోని ఒక గదిని పాఠశాలకు కేటాయించారు. 5 తరగతులు ఉన్న ఈ పాఠశాలలో 22 మంది విద్యార్థులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 5 తరగతులకు ఒకే గది కావడంతో ఇద్దరు టీచర్లు అక్కడే బోధన చేయాల్సి వస్తోంది. దీంతో ఏ విద్యార్థికి ఏ తరగతి పాఠం చదవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పాఠశాలలోని ఇంకో గదిలో ఉన్నటువంటి సామగ్రిని అంగన్వాడీ కేంద్రంలో పడేయడంతో అందులోనూ విద్యా బోధన జరగని పరిస్థితి నెలకొంది. కొత్తగా ఆవిర్భవించిన రెవెన్యూ పాలనతో పేద విద్యార్థులకు చదువుకునేందుకు ఇబ్బందులు నెలకొంటున్నాయి.

●(ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)



పాఠమిక పాఠశాలలో రెవెన్యూ కార్యాలయం



హస్నాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

పంటల సాగు ఎలా ఉంది..!?

- రైతులతో కలెక్టర్ మాటామంతి

తాంసి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు ఎలా ఉంది.. కాలం అనుకూలంగా ఉందా.. విత్తనాల లోపం ఏమైనా ఉందా.. దిగుబడులు ఎంతవరకు వచ్చాయి.. ఎరువులు సకాలంలో అందుతున్నాయా అంటూ పలువురు రైతులతో కలెక్టర్ రాజర్షిషా ముచ్చటించారు. శుక్రవారం సాయంత్రం మ ండలంలోని హస్నాపూర్ గ్రామానికి వచ్చిన ఆయన పలు పంట పొలా లతోపాటు గ్రామంలోని పరిసరాల పరిశుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఏయే పంటలు అనుకూలంగా ఉన్నాయో అడిగి తెలుసుకుని పలు సూచనలుచేశారు. అధికారులు గ్రామంలోకి వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నారో లేదో క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు ఏ సమస్యలు ఉన్న నేరుగా తమ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని సూచిం చారు. వ్యవసాయశాఖ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. గ్రామంలోని పలు వీధుల్లో తిరుగుతూ సంక్షేమ పథకాలు ఏ మేరకు సద్వినియోగమవుతున్నాయో తెలుసుకున్నారు.

పంట దిగుబడులను సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేయాలి

- నాబార్డు డీజీఎం శ్వేత

తలమడుగు, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన దిగుబడులను సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేయాలని నాబార్డు డీజీఎం శ్వేత కోరారు. మండలంలోని సుంకిడిలో శుక్రవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మర్ అగ్రిమార్ట్ కేంద్రాన్ని నాబార్డు డీజీఎం శ్వేత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ రైతుల ద్వారా నిర్వహిస్తున్న అగ్రిమార్ట్‌ను అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా అందరికీ అందుబాటు ధరలో నాణ్యమైన వస్తువులను అందించాలన్నారు. రైతుల అభివృద్ధికి దోహదం పనులు చేపట్టాలన్నారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలన్నారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే నాబార్డు నుంచి అందించిన మ్యాక్స్ పికప్ వల్ల ఇలాంటి లాభాలు ఉన్నాయని అడిగితెలుసుకున్నారు. మ్యాక్స్ పికప్ వల్ల సొంతంగా వస్తువులు తెచ్చుకోవడం జరుగుతుందన్నారు. సూపర్ మార్కెట్ వల్ల రైతులకు ఉపయోగాలతోపాటు మరింత అభివృద్ధి పరచాలని సూచించారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం రావుఫ్ పీఏసీఎస్ సీఈవో మోతి శ్రీనివాస్, సాగర్, భీమ్రావు, అశోక్, సుమన్, ముస్తఫా సిబ్బంది పాల్గొన్నారు.



అగ్రిమార్ట్‌ను పరిశీలిస్తున్న నాబార్డు డీజీఎం శ్వేత

- అధికార పార్టీలో ఉన్నా.. అసంతృప్తి ఎందుకు?
- అసలు కనిపించకుండానే పోయిన మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీ
- పార్టీలో ప్రాధాన్యత లేదా? లేక పట్టించుకోవడం లేదా?
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఊపందుకున్నా బయటకు రాని సీనియర్ నేతలు

ఆ 'మాజీ'లకు.. ఏమైనట్టు!?



ఆదిలాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది క్రితంవరకు జిల్లా రాజకీయాల్లో చాలా యాక్టివ్‌గా కనిపించిన మాజీ నేతలు పూర్తిగా సైలెంట్ అయిపోవడంతో రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వరకు అంతా బాగానే కనిపించిన ఆ తర్వాతే కొంత గ్యాప్ వచ్చినట్లు కనిపిస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేసిన చివరకు చేజారి పోవడంతో నిరాశే మిగిలింది. దీంతో తమ రాజకీయ భవిష్యత్తు కోసం ఏకంగా కండువాలనే మార్చేశారు. ఆదిలాబాద్ మాజీఎంపీ సోయంబాపురావ్‌కు బీజేపీ సిట్టింగ్ టికెట్ దక్కకపోవడంతో ఆ పార్టీకి దూరమై కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్‌కు బీఆర్ఎస్ అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన కూడా బీఆర్ఎస్‌కు గుడ్‌బాయ్ చెప్పారు. మొదట బీజేపీలో చేరిన ఆ తర్వాత కాంగ్రెస్ కండువా వేసుకున్నారు. అలాగే ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ అంచనాలు తలకిందులు కావడంతో ఏకంగా బీఆర్ఎస్ అధిష్ఠానాన్ని ఎదురించే పనిచేశారు. ఎన్నికల సమయంలో నిర్వహించిన ఓ బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సంచలన వ్యాఖ్యలు చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన ఈ ముగ్గురు సీనియర్ నేతలు ఎన్నికల తర్వాత అసలు కనిపించకుండానే పోవడం అంతటి హట్ టాఫిక్‌గా మారింది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రధాన పార్టీలు పోటాపోటీగా ప్రచారానికి దిగుతున్నాయి. అయినా సీనియర్ నేతలు మౌనం వీడకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమన్వయం ఏదీ ?

అధికార కాంగ్రెస్ పార్టీ నేతల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికీ ప్రతిపక్షంలో ఉన్నట్లుగానే నేతలు వ్యవహరించడంతో పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. మాజీ ఎంపీ సోయంబాపురావ్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క పర్యటనలో అడపాదడపాగా పాల్గొంటున్న మాజీ ఎమ్మెల్యేలు రేఖాశ్యామ్ నాయక్, రాథోడ్ బాపురావ్‌లు మాత్రం అసలు కనిపించడమే లేదన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న కలుపుకొని పోవడంలేదన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పార్టీ అధిష్ఠానం పెద్దలు పలుమార్లు హెచ్చరించినా నేతల తీరులో మార్పు కనిపించడం లేదంటున్నారు. అన్ని నియోజకవర్గాల్లో గ్రూపు విభేదాలు పెరిగిపోవడంతో ఆధిపత్య పోరు కనిపిస్తోంది. ముఖ్యంగా బోథ్ ఆదిలాబాద్, ఖనాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యే సీనయర్ నేతలను కలుపుకుని ముందుకు వెళ్లడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. వాటిలో సమన్వయం లేకపోవడంతో ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. నేతల మధ్య సఖ్యతలేకపోవడంతో పార్టీ కార్యకర్తలు అయోమయానికి గురవతున్నారు. ఇలాంటి పరిస్థితిలో పార్టీ విజయావకాశాలపై మరింత ప్రభావం పడే అవకాశాలు ఉందంటున్నారు. అధికారిక పార్టీ కార్యక్రమంలోనూ సీనియర్ నేతలకు కనీసం సమాచారం ఇవ్వడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నారు.

సీనియర్ నేతల అసంతృప్తి

అన్నింటినీ త్యాగంచేసి అధికార కాంగ్రెస్‌పార్టీలో చేరినా పార్టీలో సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని సీనియర్ నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కొందరు నేతల తీరుతోనే అధిష్ఠానం పెద్దలు పట్టించుకోవడం లేదంటున్నారు. కొంత మంది నేతల తీరుతో జిల్లాలో పార్టీ పరిస్థితులు అదుపుతప్పు తున్నాయని పేర్కొంటున్నారు. సీనియర్లకు కనీస గౌరవం ఇవ్వడం లేదని వాపోతున్నారు. పార్టీలో చేరిన సమయంలో అధిష్ఠానం పెద్దలు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడమే అసలు కారణంగా తెలుస్తోంది. నామినేట్ పదవుల మాట దేవుడెరుగు గానీ పార్టీలో అసలు ప్రాధాన్యతనే లేకుండానే పోయిందనీ వాపోతున్నారు. రాష్ట్రస్థాయి నేతలు, మంత్రులు జిల్లాలో పర్యటిస్తున్నా కనీస సమాచారం ఉండడంలేదని చెబుతున్నారు. ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన పట్టించుకోవడంలేదని పేర్కొంటున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బందులు తప్పవంటున్నారు. సీనియర్ నేతలంతా కలిసికట్టుగా పనిచేస్తూనే ఎమ్మెల్యే ఎన్నికల్లో విజయావకాశాలు మెరుగుపడే అవకాశం ఉందంటున్నారు.

పార్టీ కార్యక్రమాలకు దూరం

పార్టీలో పెద్దగా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో సీనియర్ నేతలంతా సొంతపనులకే పరిమితమవుతున్నారు. ఎక్కువగా హైదరాబాద్‌లోనే కాలక్షేపం చేస్తున్నారు. అడపాదడపాగా జిల్లాకు వస్తున్న పార్టీ కార్యక్రమాలకు దూరం దూరంగానే ఉంటున్నారు. ఇలాంటి పరిస్థితులతో అసలు సీనియర్ నేతలు ఏ పార్టీలో ఉన్నా సొంత పార్టీ కార్యకర్తలకే అర్థం కానీ పరిస్థితులు నెలకొంది. కనీసం జిల్లా (తరువాయి 6వ పేజీలో..)

అపార్‌పై నిర్లక్ష్యం చేయొద్దు

- కార్డులు జనరేట్ చేయని జడ్పీహెచ్ఎస్ హెచ్ఎంపై డీఈవో ఆగ్రహం
- అపార్ కార్డుల జనరేట్ వేగవంతం చేయాలని ఆదేశాలు

ఇచ్చోడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు మీడియం)లో అపార్ గుర్తింపు కార్డులను జనరేట్ చేయడంలో ఎందుకు జాప్యంపై చేస్తున్నారని హెచ్ఎం సురేష్ జోషి, సిబ్బందిపై జిల్లా విద్యాధికారి ప్రణీత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం డీఈవో ప్రణీత సందర్శించారు. జిల్లా పరిషత్తు ఉర్దూ మీడియం పాఠశాలలో ప్రతీ విద్యార్థికి అపార్ గుర్తింపు కార్డు జనరేట్ చేయించి ప్రింట్ తీయి ంచి విద్యార్థులకు అందించడంపై హెచ్ఎం కసావత్ బిక్కును డీఈవో ప్రసంశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు మీడియం)ను డీఈవో సందర్శించారు. ఆశించిన స్థాయిలో విద్యార్థులకు అపార్ గుర్తిం పు కార్డులు జనరేట్ కాకపోవడంపై జిల్లా పరిషత్తు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ జోషి, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అపార్ కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పాఠశాల పనులను వేగవంతం చేయాలన్నారు. పాఠశాల పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్

బీజేపీ అభ్యర్థి గెలిచేలా పనిచేయాలి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్

నేరడిగొండ, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీజేపీ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యతను ప్రతీ కార్యకర్త తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆకుల రాజశేఖర్, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు గట్టు నారాయణ, జిల్లా విశ్వకర్మ యోజన కన్వీనర్ చోక్కపల్లి రాములు, మాజీ ఎంపీటీసీ రాజు, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మావల, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): హెయిర్‌కలర్ తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని దస్నాపూర్‌కి చెందిన దామాన్ విజయ్ (35) మేస్త్రి పని చేస్తున్నారు. గత 2నెలలుగా పనులు లేక రూ.2లక్షలు అప్పు చేశాడు. అప్పు తీర్చలేక తాగిన మైకంలో ఈనెల 18న శంకర్ గుట్టసమీపంలో హెయిర్ కలర్‌ను తాగాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. కాగా మూడు రోజులుగా చికిత్స పొందుతున్న విజయ్ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఓ మద్యం షాపులో దొంగతనం జరిగిన ఘటన ఇంద్రవెల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని ఈశ్వర్‌నగర్ గ్రామ సమీపంలోని ఉన్న జైదుర్గావైన్ షాపులో గురువారం అర్ధరాత్రి షట్టర్ తాళాన్ని ధ్వంసం చేసి లోపల ఉన్న వివిధ రకాల మద్యం సీసాలను అపహరించారు. చోరీకి గురైన మద్యం సీసాల విలువ సుమారు రూ.3960 వరకు ఉంటుందని, మద్యం షాపులోని నగదు రూ. 5,700 చోరీ జరిగిందని షాపు నిర్వాహకుడు ముండే బాబు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు.

23న రాష్ట్రీయ గురు రవిదాస్ ఫెస్టివల్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న రాష్ట్రీయ గురు రవిదాస్ ఫెస్టివల్‌ను ఆదిలాబాద్‌లోని చిలుకూరి లక్ష్మీనగర్‌లో ఉన్న సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మధు బావల్కర్ తెలి పారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంస్కృతిక, సమ్మేళనం, సామాజిక కార్యకర్తల సన్మానం ఉంటుందన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు రఘునాథ్ ఇట్కరే, సంజయ్, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు పర్వతంపైకి శివుని భారీ విగ్రహం

ఉట్నూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని సాలెవాడ(కె)లోని శివాలయం సమీపంలో ఉన్న పర్వతంపైకి ఎట్టకేలకు భారీ శివుని విగ్రహాన్ని చేర్చారు. సాలెవాడ (కె) గ్రామస్థులు గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు శ్రమించి భారీ వాహనం ద్వారా క్రేన్ సహాయంతో 21.10 ఫీట్ల ఎత్తు ఉన్న శివుని విగ్రహాన్ని పర్వతంపైకి తరలించి గద్దెపై కూర్చోబెట్టారు. రానున్న శివ రాత్రి పర్వదినం సందర్భంగా హోమం నిర్వహించి, శివుని విగ్రహాన్ని ప్రారం భిస్తారని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.



సాలెవాడ(కె) పర్వతంపై శివుడి విగ్రహం

పాఠశాలలో హెల్త్ క్యాంపు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు వస్తుండడంతో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశామని గౌతం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వసంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఓంకార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరీక్షించి మందులను అందించారు. పిల్లల ఆరోగ్యం బాగుంటేనే వారు చదువుల్లో రాణిస్తారని తెలిపారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు.

కుంభమేళా యాత్రికులకు ఆహార పొట్లాల పంపిణీ

ఇచ్చోడ, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిని ఆనుకుని వెళ్లే భారీ వాహనాలు నిలుపు స్థలంలో ఇచ్చోడ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త నిమ్మల సంతోష్‌రెడ్డి కుంభమేళా యాత్రికులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు రోజుకు వేల సంఖ్యలో వెళ్తుండడంతో వారికి దారి పొడవున కనీస సౌకర్యాలు దొరకడంలేదని, భావించిన ప్రయాణికులకు ఆహార పొట్లాలతోపాటు నీటి డబ్బాలను అందజేశారు . ఆయన వెంట గోవింద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

- ఐటీడీఏ ఇంజనీర్

ఉట్నూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకోవాలని ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం సహాయ ఇంజనీర్ రాథోడ్ ఇందల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ హాజరుకాగా, ఏఈ ఇందల్ మాట్లాడుతూ మత్తడిగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శంభు పటేల్ కూడ, మత్తడిగూడ, పెద్ద శుద్ధ గూడ, చిన్న శుద్ధ గూడ, దుర్గా పూర్, రాంపూర్ చెందిన కనీస ఇళ్లు లేని ప్రజలకు మొదటి జాబితాలో 156 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని అన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటే విడుతల వారీగా బిల్లులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, గ్రామస్తులు లచ్చు పటేల్, మడావి తిరుపతి, ఆత్రం తిరుపతి పాల్గొన్నారు.


మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో శ్రామిక మహిళాదినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు గొడం రేణుక తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అడ్డగోలు దందాపై అధికారుల కొరడా

- ఓపెన్ ప్లాట్ల ఫేక్ డోర్ నెంబర్లు రద్దు
- ఇల్లీగల్ రిజిస్ట్రేషన్‌లను నిలిపివేయాలంటూ సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అదిలాబాద్ జిల్లా కేంద్రంలో సాగుతున్న అడ్డగోలు దందాపై అధికారులు కొరడా ఝులిపించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన అడ్డగోలు దందా.. అనే వార్త కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఎలాంటి అనుమతులు లేకుండా జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో సర్వే నెంబర్ 25/2లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేయరాదంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఆ వెంచర్‌లో ఎలాంటి నిర్మాణాలు లేకున్న ఓపెన్ ప్లాట్లకు కేటాయించిన మూడు డోర్ నంబర్లను రద్దు చేశారు. అలాగే ఫేక్ డోర్ నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్ సివిఎన్ రాజు అదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ అధికారులకు ప్రత్యేక లేఖను రాశారు. మున్సిపల్ పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లపై తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. ఫేక్ డోర్ నంబర్లను జారీ చేసిన అధికారులపై విచారణ కొనసాగుతుందని త్వరలోనే సంబంధిత అధికారులపై శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు.



ఫేక్ డోర్ నంబర్లను రద్దు చేస్తూ ఆన్‌లైన్‌లో నుంచి తొలగించిన మున్సిపల్ అధికారులు



రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని సబ్ రిజిష్టర్ కార్యాలయ అధికారులకు మున్సిపల్ కమిషనర్ రాసిన లేఖ